1St Year Happy Work Anniversary.

షణ్ముఖ SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 213 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 30 జూన్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 213 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 30 June 2025 PAGES : 8 PRICE : 3/-

# అందరికంటే అత్యుత్తమంగా ఉచిత బస్సు ప్రయాణం



### ఆర్థికంగా భారమైనా.. మహిళల కోసం ఆగస్టు 15 నుంచి అమలు
### ఇకపై ఆర్టీసీలో అన్నీ విద్యుత్ బస్సులే తీసుకోవాలి
### సమీక్షలో సీఎం చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 29)



మహిళలకు ఉచిత ప్రయాణంపై చర్చిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే తదితరులు

'ప్రస్తుతం దిల్లీ, పంజాబ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాయి. అన్నీ వేర్వేరు విధానాలను పాటిస్తున్నాయి. మన విధానం అత్యుత్తమంగా, సంతృప్తి కలిగేలా ఉండాలి' అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజలకిచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, అందుకే ఆగస్టు 15 నుంచి ఈ పథకం అమలుచేస్తామని సీఎం తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై.. సీఎం చంద్రబాబు శనివారం క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ పథకం వల్ల పెరిగే ప్రయాణికుల సంఖ్యకు తగినట్లు బస్సుల సంఖ్య పెంచాలని ఆదేశించారు. కొత్త బస్సులు కొనాలని, అవసరమైతే అద్దెకు -మిగతా 2లో

# మనం ఆ తప్పు చేయకూడదు

### అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలా పనిచేయాలని శ్రేణులకు పిలుపు
### వైసీపీలా అహంకారానికి పోవద్దని కార్యకర్తలకు గట్టి హెచ్చరిక
### కూటమి ప్రభుత్వ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కొత్త కార్యక్రమం
### సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ తెలుగుదేశం'
### జులై 5 నాటికి పార్టీ కమిటీల నియామకం పూర్తి చేయాలని ఆదేశం

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 29)



అధికారం చేతికి వచ్చిందన్న అలసత్వం ప్రదర్శించవద్దని, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తమ పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వ పతనాన్ని ఉదాహరణగా చూపుతూ, అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన గట్టిగా హెచ్చరించారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన, కూటమి ప్రభుత్వ పాలనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు 'సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ తెలుగుదేశం' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, "151 సీట్లు గెలిచిన -మిగతా 2లో

## ట్రకోమా రహిత దేశంగా భారత్: మోదీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 29)

బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ ట్రకోమా రహిత దేశంగా భారత్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందని ప్రధాని మోదీ వెల్లడించారు. ఇందు కోసం కృషి చేసిన అందరికీ అభినందనలు తెలిపారు. మోదీ 123వ మన్‌కీ బాత్ ఎపిసోడ్ నేడు ప్రసారమైంది. మిల్లెట్ బిస్కెట్లు తయారు చేస్తున్న తెలంగాణలోని భద్రాచలం ప్రాంత మహిళలను అభినందించారు. జూన్ 21న జరిగిన యోగాడే కార్యక్రమాల్లో దేశ, ప్రపంచ వ్యాప్తంగా లక్షల మంది పాల్గొన్నారన్నారు. దాదాపు 10 ఏళ్ల క్రితం మొదలైన ఈ కార్యక్రమం ఏటేట మరింత విస్తరిస్తోందన్నారు. చాలా మంది ప్రజలు యోగాను తమ జీవితంలో భాగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు.దేశంలో ఎమర్జెన్సీ విధించిన వారు రాజ్యాంగాన్ని హత్య చేయడం తోపాటు.. న్యాయ విభాగాన్ని బానిసగా మార్చుకోవాలనుకున్నారని మోదీ తెలిపారు. నాడు జార్జిఫెర్నాండెజ్‌ను సంకెళ్లతో బంధించారన్నారు. కానీ, భారత ప్రజలు శక్తిమంతమైన వారు కావడంతో.. ఎమర్జెన్సీ తొలగిపోయిందని చెప్పారు. దానిని విధించినవారు. -మిగతా 2లో



## నక్సలైట్లు తక్షణమే హత్యాకాండ ఆపేసి లొంగిపోవాలి

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 29)

నక్సలైట్లు తక్షణమే హత్యాకాండ ఆపేసి లొంగిపోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. నిజామబాద్‌లో పసుపుబోర్డు జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం స్థానిక పాలిటెక్నిక్ మైదానంలో ఏర్పాటు చేసిన రైతు సమ్మేళన సభలో ఆయన ప్రసంగించారు. "పహల్గాంలో ఉగ్రదాడితో పాకిస్థాన్ మనల్ని భయపెట్టాలని చూసింది. ఆ తర్వాత భారత్ శక్తి ఏమిటో పాకిస్థాన్‌కు, ప్రపంచానికి తెలిసింది. ఉగ్రవాదాన్ని మాత్రమే కాదు.. దేశంలోని నక్సలిజం కూడా లేకుండా చేయాలన్నదే మోదీ లక్ష్యం. నక్సలిజాన్ని తుదముట్టించాలా లేదా? మీరే చెప్పండి. 2026 మార్చి 30 లోపు దేశంలో నక్సలిజం లేకుండా చేస్తాం. నక్సలైట్లు తక్షణమే హత్యాకాండ ఆపేసి లొంగిపోవాలి. నక్సలైట్లు త్వరగా జనజీవన స్రవంతిలోకి రావాలి. ఇప్పటికే 10వేల మంది నక్సలైట్లు లొంగిపోయారు.. -మిగతా 2లో



## పాక్‌వన్నీ తప్పుడు ఆరోపణలే.. ఆత్మాహుతి దాడిపై స్పందించిన భారత్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూన్ 29)

పాకిస్థాన్ లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో శనివారం ఆత్మాహుతి దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడి వెనుక భారత్ హస్తం ఉందంటూ పాక్ సైన్యం చేసిన ఆరోపణలను న్యూదిల్లీ తీవ్రంగా ఖండించింది. అవన్నీ తప్పుడు ఆరోపణలని స్పష్టం చేసింది. భారత విదేశాంగశాఖ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఆత్మాహుతి దాడి నేపథ్యంలో భారత్‌పై నిందలు వేస్తూ పాక్ సైన్యం చేసిన అధికారిక ప్రకటన తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. ఈ ప్రకటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేసింది. పేలుడు పదార్థాలున్న వాహనంతో ఓ ఉగ్రవాది సైనిక కాన్వాయ్‌పైకి దూసుకెళ్లాడు. దీంతో వాహనంలో భారీ పేలుడు -మిగతా 2లో

## రైతును రారాజు చేయాలనేది నరేంద్రమోదీ నినాదం: కేంద్రమంత్రి బండి సంజయ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 29)

నరేంద్రమోదీ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. నిజామాబాద్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం స్థానిక పాలిటెక్నిక్ మైదానంలో ఏర్పాటు చేసిన రైతు సమ్మేళన సభలో



మరో కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రసంగించారు.

"పసుపు బోర్డు కోసం ఇందూరు రైతులు గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను దిల్లీలో పసుపు అర్వింద్ అంటున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమిత్ షా ఆదేశాలతో నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటు చేశారు. దీంతో పాటు జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా నిజామాబాద్ వ్యక్తినే నియమించారు. రైతును రాజు చేయాలనేది గత నినాదం. రైతును రారాజు చేయాలనేది నరేంద్రమోదీ నినాదం. రైతులంతా మోదీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి.. అండగా ఉండాలి. తెలంగాణలో అన్ని పార్టీలకు అవకాశం ఇచ్చారు. భాజపాకు ఒక్కసారి అవకాశమివ్వండి" అని బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు.

# దేశ చరిత్రను వక్రీకరించారు

(షణ్ముఖ వెలుగు, హైదరాబాద్, జూన్ 29)

దేశ చరిత్ర వక్రీకరణకు గురైందని, మన గొప్పతనాన్ని పాశ్చాత్యులు జీర్ణించుకోలేకపోయారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. నిజమైన చరిత్రను యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ రచించిన 'బహుముఖ బనారస్' పుస్తకాన్ని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఓ హోటల్‌లో ఆయన శనివారం ఆవిష్కరించారు. 'మిసిమి' మాసపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'మధ్యయుగంలో జరిగిన దండయాత్రల్లో మన సంపదను దోచుకెళ్లారు. సంస్కృతీ సంప్రదాయాల్ని నాశనం చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు నలంద, తక్షశిలను ధ్వంసం చేశారు. బ్రిటిష్ పాలనకు ముందు భారత్ అన్నింట్లో అగ్రస్థానంలో ఉండేది. యువత తలచుకుంటే మళ్లీ ఆ స్థాయికి చేరుకోవడానికి ఎక్కువ సమయం పట్టదు. నూతన విద్యావిధానంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇందులో రాజకీయానికి ఆస్కారం లేదు. -మిగతా 2లో



## తెదేపా విస్తృతస్థాయి సమావేశం ప్రారంభం

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 29)

తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశం ప్రారంభమైంది. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, పరిశీలకులు హాజరయ్యారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి సీఎం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జులై రెండో తేదీ నుంచి నిర్వహించనున్న ఇంటింటి ప్రచారంపై నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీ భవిష్యత్తు కార్యచరణపై ప్రధానంగా చర్చించనున్నారు. నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదు, మూడు పార్టీల సమన్వయంపై చర్చించనున్నారు.



## అన్ని నియోజకవర్గాల్లో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు

(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 29)

సామాన్యులకు నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తేవడానికి రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ 100 నుంచి 300 పడకల స్థాయి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మించబోతున్నట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 100 పడకల మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మించనున్నట్లు చెప్పారు. టైమ్స్ నౌ ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ జరిగిన డాక్టర్స్ కాంక్లేవ్‌లో పాల్గొన్న అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'వైకాపా ప్రభుత్వం భ్రష్టుపట్టించిన ప్రజా వైద్య వ్యవస్థను సరిదిద్దుతున్నాం. ఈ రంగంలో మౌలిక వసతుల కల్పనకు నాలుగు సూత్రాల విధానాన్ని అనుసరిస్తున్నాం. -మిగతా 2లో



# అందరికంటే అత్యుత్తమంగా ఉచిత బస్సు ప్రయాణం

తీసుకోవాలని సూచించారు. ఇకపై తీసుకునే బస్సులన్నీ విద్యుత్‌వే ఉండాలని, ఇప్పుడున్న బస్సులనూ ఈవీలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలన్నారు.

అన్ని మోడళ్లనూ పరిశీలించండి.'డీజిల్, విద్యుత్, సీఎన్జీ బస్సులు, బ్యాటరీ స్వాపింగ్.. ఇలా ఏ బస్సుల కొనుగోలు, నిర్వహణకు ఎంత ఖర్చవుతుందో ప్రతిపాదనలు రూపొందించండి. బ్యాటరీతో, బ్యాటరీ లేకుండా బస్సులు, ప్రైవేటు సంస్థలు సర్వీస్ స్టేషన్లను నిర్వహించడం, బస్సులు ఆపరేట్ చేయడం.. ఇలా ఏ విధానంలో ఖర్చు తగ్గుతుందో పరిశీలించాలి. ఆర్టీసీయే విద్యుదుత్పత్తి చేసి, దానిని బస్సులకు వినియోగించగలిగితే ఎంత మేరకు నిర్వహణ వ్యయం తగ్గుతుందో అంచనా వేయండి' అని సీఎం ఆదేశించారు. 'ఆర్థిక కష్టాలు అధిగమించాలంటే ఆర్టీసీ ఆదాయ మార్గాలు పెంచుకోవాలి. ఖర్చు ఎలా తగ్గించుకోవాలి? ఇతర ఆదాయ మార్గాలేంటని దృష్టిపెట్టాలి. బస్టాండ్లలో మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచడం మొదలుకొని.. ప్రయాణం వరకు అన్నింటా ప్రయాణికుల్లో సంతృప్తి పెరిగేలా నిర్వహణ ఉండాలి' అని సీఎం పేర్కొన్నారు.

### 88.90 కోట్లకు పెరగనున్న మహిళల ప్రయాణాలు

'రాష్ట్రంలో 2.62 కోట్ల మంది మహిళలు ఉన్నారు. వీరిలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఏటా మహిళల ప్రయాణాల సంఖ్య 43.06 కోట్లుగా ఉంది. ఉచిత బస్సుప్రయాణ పథకం అమలుచేస్తే, ఇది ఏటా 75.51 కోట్లకు పెరుగుతుంది. ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో మహిళల ప్రయాణాల సంఖ్య ఏటా 6.85 కోట్లు ఉండగా, అది 13.39 కోట్లకు పెరుగుతుంది. మొత్తంగా ఉచిత బస్సు ప్రయాణ పథకంతో మహిళలు ఏడాదిలో 88.90 కోట్లసార్లు ప్రయాణించే వీలుంది. ప్రతి మహిళ వారానికి ఒకసారైనా ప్రయాణిస్తారు' అని అధికారులు సీఎంకు వివరించారు.

ఈ పథకం అమలుకు అదనంగా 2,536 బస్సులు అవసరమని అధికారులు సీఎంకు తెలిపారు. ఇందుకు రూ.996 కోట్లు అవుతుందన్నారు. బస్టాండ్లలో తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ, సమాచార బోర్డులు, ఇతర సదుపాయాలు మెరుగుపరచాలని తెలిపారు. ఈ సమీక్షలో రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే తదితరులు పాల్గొన్నారు.

### వచ్చే వారం మరోసారి భేటీ

ఈ పథకంపై సీఎం చంద్రబాబు వచ్చేవారం మరోసారి సమీక్ష నిర్వహించనున్నారు. ఈలోపు విద్యుత్ బస్సులు, సీఎన్‌జీ బస్సులు, బ్యాటరీ స్వాపింగ్.. తదితరాలపై అధ్యయనం చేసి నివేదికతో రావాలని సీఎం ఆదేశించారు.ఆర్టీసీలో ప్రస్తుతమున్న బస్సుల్లో 57% పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ సర్వీసులే. ఎక్స్‌ప్రెస్‌లు, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు మరో 17% ఉన్నాయి. రాష్ట్రంలో పెద్ద నగరాలు లేకపోయినా సరే.. సీఎం చంద్రబాబు లేఖ రాయడంతో కేంద్రం స్పందించి.. 11 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో 750 విద్యుత్ బస్సులను పట్టణ రవాణా కింద అందిస్తోంది.

# ట్రకోమా రహిత దేశంగా భారత్: మోదీ

ఓడిపోయారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మొరార్జీ దేశాయ్, వాజ్‌పేయి, బాబూ జగ్జీవన్ రామ్ వంటి నేతల ప్రసంగాలను మోదీ వినిపించారు. ఎమర్జెన్సీపై పోరాడిన వారిని కచ్చితంగా గుర్తుపెట్టుకోవాలన్నారు.

ఫుట్‌బాల్ ఆటగాళ్లకు కేంద్రంగా బోడోల్యాండ్ మారిందని అభినందించారు. పరిమిత వనరులతోనే సాధన చేసి అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. దేశంలోని చిన్నారులకు వీరు ఆదర్శంగా మారారని కొనియాడారు. ఫిట్‌నెస్, ఊబకాయం తగ్గించుకోవడానికి ఆహారంలో నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించుకోవాని సూచించారు.

మేఘాలయ ఎరీసిల్క్‌కు జీఐ ట్యాగ్ లభించిందని అభినందించారు. పురుగులను చంపకుండా వస్త్రాన్ని తయారు చేయడం దీని ప్రత్యేకతన్నారు. ఇక తెలంగాణ భద్రాచలంలోని ఆదివాసి మహిళలు 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్' పేరిట బిస్కెట్లు తయారు

## మొదటిపేజీ తరువాయి

చేస్తున్నారని.. అవి హైదరాబాద్ నుంచి లండన్‌కు కూడా ఎగుమతి అవుతున్నాయని వెల్లడించారు. ఈ మహిళలే మూడు నెలల్లో 40,000 శానిటరీ నాప్కిన్లను తయారు చేసి విక్రయించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాలో బౌద్ధక్షేత్రాలకు విదేశాల్లో అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. అందరూ తమ ప్రాంతాల్లోని బౌద్ధ క్షేత్రాలను ఒక్కసారైనా సందర్శించాలన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న శుభాంశు శుక్లాకు అభినందనలు తెలిపారు.

# నక్సలైట్లు తక్షణమే హత్యాకాండ ఆపేసి లొంగిపోవాలి

జన జీవన స్రవంతిలోకి వచ్చేశారు.

### తెలంగాణలోనూ అధికారంలోకి వస్తాం..

తెలంగాణలో భాజపా తప్పక అధికారంలోకి వస్తుంది. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే భాజపా విజయం ఖాయమైందని తెలుస్తోందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఎంపీ అర్వింద్ నిజామాబాద్‌కు పసుపుబోర్డు సాధించారు. పసుపుబోర్డు ప్రధాన కార్యాలయాన్ని కూడా నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేస్తున్నాం. మోదీ ఏదైనా చెప్పారంటే అది తప్పకుండా చేసి చూపిస్తారు. నిజామాబాద్ రైతులు పసుపుబోర్డు కోసం 40 ఏళ్ల పాటు పోరాటం చేశారు. నిజామాబాద్ రైతులు పండించిన పసుపు భవిష్యత్‌లో ప్రపంచమంతా ఎగుమతి అవుతుంది. పసుపుబోర్డు కార్యాలయం ఏర్పాటుతో స్థానిక రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలగనున్నాయి. భారత్ ఆర్గానిక్ లిమిటెడ్, భారత్ ఎక్స్‌పోర్టు లిమిటెడ్ కూడా నిజామాబాద్‌లోనే ఏర్పాటవుతున్నాయి. భారత్ ఎక్స్‌పోర్టు లిమిటెడ్‌తో నిజామాబాద్ పసుపు అమెరికా, యూరప్‌కు ఎగుమతి అవుతుంది. భారాస సర్కార్ అవినీతికి పాల్పడిందా? లేదా? ధరణి పోర్టల్, కాళేశ్వరం.. ఇలా అనేక అంశాల్లో భారాస ప్రభుత్వం అవినీతికి పాల్పడింది. కాంగ్రెస్ పార్టీ తెలంగాణను దిల్లీకి ఏటీఎంగా మార్చేసింది. తెలంగాణలో భారాస పోయింది.. కానీ, అవినీతి పోలేదు" అని అమిత్ షా అన్నారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ధర్మపురి అర్వింద్, లక్ష్మణ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు సభలో పాల్గొన్నారు.

# మనం ఆ తప్పు చేయకూడదు

పార్టీ కేవలం 11 స్థానాలకే పరిమితమైందంటే దానికి వారి అహంకారమే ప్రధాన కారణం. మనం ఆ తప్పు చేయకూడదు. అధికారంలో ఉన్నప్పటికీ, ప్రతిపక్షంలో ఉన్నట్లే ప్రజలతో మమేకమవ్వాలి. వారి కష్టసుఖాలు తెలుసుకుంటూ ముందుకు సాగాలి" అని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో చారిత్రక విజయం వెనుక కార్యకర్తల అలుపెరగని శ్రమ ఉందని, కష్టపడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోవద్దని నేతలకు సూచించారు.

ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు 'సుపరిపాలనలో తొలి అడుగు – ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని నెల రోజుల పాటు నిర్వహించనున్నట్లు లోకేశ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విధిగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించాలని ఆదేశించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, ఇచ్చిన మాట ప్రకారం 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేశామని, ఇదే విధంగా ప్రతి హామీని పద్ధతి ప్రకారం నెరవేరుస్తామని ఆయన స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై కూడా లోకేశ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. జులై 5వ తేదీ నాటికి పార్టీ కమిటీల నియామకాలన్నీ పూర్తి చేయాలని గడువు విధించారు. పార్టీ అనుబంధ విభాగాలను బలోపేతం చేయడంతో పాటు, మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పార్టీ కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేయాలని నొక్కిచెప్పారు. పార్టీని నాలుగు దశాబ్దాలుగా ముందుకు నడిపిన సీనియర్ల అనుభవాన్ని, యువత ఉత్సాహాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. "ప్రపంచమంతా తిరిగినా మనం తిరిగి వచ్చేది పవిత్ర దేవాలయం లాంటి పార్టీ కార్యాలయానికే. గత పాలనలో అలాంటి కార్యాలయంపై దాడి జరిగినా పట్టించుకోని దుస్థితి చూశాం" అని ఆయన గుర్తుచేశారు. పార్టీ ఇచ్చే ప్రతి పిలుపును సీరియస్‌గా తీసుకుని విజయవంతం చేయాలని, ఎక్కడ కూర్చోవాలో నిర్ణయించేది ప్రజలేనని ఆయన కార్యకర్తలకు ఉద్బోధించారు.

# దేశ చరిత్రను వక్రీకరించారు

ఆంధ్రా విశ్వవిద్యాలయంలో చదువుతున్న సమయంలో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించగా... సుమారు 17 నెలల పాటు జైలులో ఉన్నాను. ఎమర్జెన్సీలో ఎదురైన పరిస్థితులపై పాఠ్యాంశం తీసుకురావాల్సిన అవసరం ఉంది' అన్నారు.

కార్యక్రమంలో మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్, ఓయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధ్యక్షుడు ప్రొఫెసర్ వై.పార్థసారథి, కేంద్ర సాహిత్య అకాడమీ (తెలుగు) కన్వీనర్ ప్రొఫెసర్ సి.మృణాళిని, దూరదర్శన్ ప్రయోక్త ఓలేటి పార్వతీశం, ఆకాశవాణి విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ సీఎస్ రాంబాబు, మిసిమి పత్రిక సంపాదకుడు వి.అశ్వినికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్‌లో తప్పి.. ఐపీఎస్‌గా ఎదిగి

దిగువ మధ్యతరగతి కుటుంబం.. వ్యవసాయమే జీవనాధారం.. పదో తరగతిలో ద్వితీయ శ్రేణి విద్యార్థి. ఇంటర్‌లో ఫెయిల్. అయినా పట్టు వీడలేదు. కష్టపడి చదివి.. ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. దాంతోనే సంతృప్తి చెందక ఉద్యోగానికి రాజీనామా చేసి మరీ సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. లక్ష్యానికి అనుగుణంగా ఐపీఎస్ అధికారి అయ్యారు. ఆయనే.. ఏపీలోని అనకాపల్లి జిల్లా కోటవురుట్ల మండలం పాములవాక గ్రామానికి చెందిన కిల్లాడ సత్యనారాయణ. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలహాబాద్ ట్రాఫిక్ విభాగంలో అదనపు డీజీపీగా పనిచేస్తున్నారు. వృత్తిరీత్యా పోలీసు అధికారి అయినా... ప్రవృత్తి సాహిత్యం. 'ఆగ్రాలో ఏఎస్పీగా మొదటి పోస్టింగ్ వచ్చింది. ఎస్పీగా నక్సల్స్ ప్రభావిత జిల్లా సోన్‌భద్రాలో, డీఐజీగా మేరట్‌లో విధులు నిర్వర్తించా. కొన్నాళ్లపాటు ఏపీలోనూ డిప్యుటేషన్‌పై పనిచేశా. ఆయా రాష్ట్రాల్లో పనిచేస్తున్నప్పుడు అనేక ప్రాంతాల్లో పర్యటించాను. ఎన్నో అంశాలు తెలుసుకున్నాను. తర్వాత వాటి గురించి వ్యాసాలు రాయడం ప్రారంభించా. అలా సాహిత్యంపై మక్కువ పెరిగింది. ఇప్పటివరకు 8 పుస్తకాలు ప్రచురించాను' అని సత్యనారాయణ 'ఈనాడు'కు తెలిపారు.

# అన్ని నియోజకవర్గాల్లో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు

ఏడాదిలోనే కింది నుంచి పైస్థాయి వరకు 2,500 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశాం. కేంద్ర ప్రభుత్వం 24 క్రిటికల్ కేర్ బెడ్స్ మంజూరు చేస్తే వాటికి రాష్ట్ర వాటా ఇవ్వకుండా ఐదేళ్లుగా వదిలేశారు. కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్ర వాటా కింద రూ.62 కోట్లు ఇచ్చి ఈ క్రిటికల్‌కేర్ బెడ్స్‌ను అందుబాటులోకి తేవడానికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేశామని చెబుతున్న వైద్య కళాశాలలకు రూ.6,500 కోట్లు ఖర్చు పెట్టాల్సి వస్తే రూ.1,400 కోట్లే ఖర్చు చేసింది. అందులోనూ రూ.700 కోట్లు అప్పు పెట్టింది. ఆ బకాయిలన్నీ తీర్చి, వైద్య కళాశాలల నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాం. ఈ వైద్య కళాశాలలను గ్రామాలు, ద్వితీయశ్రేణి పట్టణాల్లో పెట్టడం వల్ల అక్కడికి ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు వచ్చే పరిస్థితి లేదు. వాటిని పీపీపీ విధానంలో నిర్వహించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని ప్రయత్నిస్తున్నాం. గ్రామాల్లో 3,300 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల ఏర్పాటుకు కేంద్రం రూ.1,095 కోట్లు మంజూరు చేసింది. వైకాపా ప్రభుత్వం గాలికొదిలేసిన కర్నూలు స్టేట్ క్యాన్సర్ సెంటర్‌ను, కడప సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌ను వినియోగంలోకి తెచ్చాం' అని సత్యకుమార్ వివరించారు. తమ ప్రభుత్వ చర్యల వల్ల ప్రభుత్వాసుపత్రుల్లో డాక్టర్ల అందుబాటుపట్ల ప్రజల్లో సంతృప్తి స్థాయి 8 నుంచి 14% దాకా పెరిగిందన్నారు.

# పాక్‌వన్నీ తప్పుడు ఆరోపణలే.. ఆత్మాహుతి దాడిపై స్పందించిన భారత్

సంభవించింది. ఈ ఘటనలో 13 మంది పాక్ సైనికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇందులో పౌరులు, ప్రభుత్వాధికారులతో సహా 24 మందికి తీవ్రగాయాలయ్యాయి. పాకిస్థాన్‌లోని తాలిబన్ హఫీజ్ గుల్ బహదూర్ గ్రూపునకు చెందిన ఉసూద్–అల్–హర్బ్ ఈ పేలుడుకు బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించింది.

# రాష్ట్రంలో రెడ్ బుక్ పరిపాలన



(షణ్ముఖ వెలుగు, పెద్దదోర్నాల, జూన్ 29) చిన్నగుడిపాడులో బాధితులను వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బుచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ లు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ కార్యర్తలపై నాయకుల పై రెడ్ బుక్ పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. రాజ్యంగాన్ని తుంగలో తొక్కి కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం వై పాలెం నియోజకవర్గంలో వై పాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌తో కలిసి పర్యటించారు. దోర్నాల మండలం చిన్నగుడిపాడులో సర్పంచ్ వల్లభనేని పవన్ చౌదరి, ఆయన బంధువులను

రాజ్యాంగం నడవడం లేదు
కూటమి ప్రభుత్వం
బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు
మీడియాతో వైసీపీ జిల్లా అధ్యక్షులు,
దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



అక్రమంగా అరెస్ట్ చేసిన ఘటనపై వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యేలు తాటిపర్తి చంద్రశేఖర్, బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. వైసీపీ పార్టీ వారికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. పవన్ చౌదరిని ఆర్థికంగా, రాజకీయంగా ఇబ్బంది పెట్టాలనే ఈ విధంగా చేస్తున్నారన్నారు. దీని పై కలెక్టర్‌ను ఫిర్యాదు చేశామని చెప్పారు. వైసీపీ నాయులు, కార్యకర్తలు, ఎవరు అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మా పద్మజ, యల్లేష్ యాదవ్, మండల అధ్యక్షుడు వెంకట రమణారెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్, మండల నాయకులు పాల్గొన్నారు.

# తెదేపా సమావేశానికి 15 మంది ఎమ్మెల్యేలు గైర్హాజరు.. సీఎం చంద్రబాబు ఆగ్రహం

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 29)**



తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి గైర్హాజరైన 15మంది ఎమ్మెల్యేలు విదేశాల్లో ఉండటంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. నియోజకవర్గాల్లో ప్రజలకు దూరంగా ఉండటం సరికాదని సమావేశం ముగింపు సందర్భంగా.. గట్టిగా హెచ్చరించారు. ఆహ్వానితుల్లో 56మంది గైర్హాజరయ్యారని సీఎం అసహనం వ్యక్తంచేశారు. ఉదయం ఎంత మంది వచ్చారు, సంతకాలు పెట్టి ఎంత మంది వెళ్లిపోయారు, సమావేశం చివరి వరకూ ఎంత మంది ఉన్నారో అందరి లెక్కలు తన వద్ద ఉన్నాయన్నారు.

ప్రజలతో మమేకమైతేనే భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. గైర్హాజరుకు కారణాలు అడిగితే కొందరు విదేశీ పర్యటనలు అన్నారు, ఇంకొంతమంది దైవ దర్శనాలు అని సమాధానం ఇచ్చారని నేతల గైర్హాజరుపై చంద్రబాబు చురకలు అంటించారు. పార్టీ కార్యక్రమాలకంటే ఇతరత్రా ఎక్కువయ్యాయా అని నిలదీశారు. దేవాలయ సందర్శనలు మరో రోజు పెట్టుకోవచ్చు కదా అని అభిప్రాయపడ్డారు. తరచూ విదేశీ పర్యటనలు పెట్టుకునేవారు ఇక ఫారిన్‌లోనే ఉండటం మంచిదని హితవు పలికారు. తానా, ఆటాలకు టిక్కెట్లు బుక్ చేసుకున్న వారి జాబితా కూడా తన వద్ద ఉందని నేతలతో సీఎం అన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన తెలుగుదేశం విస్తృత స్థాయి సమావేశం సాయంత్రం 6.30 గంటల వరకు కొనసాగింది.





## ఆవులమంద పై పెద్ద పులి దాడి

4

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# కదిలి వచ్చిన కరేడు



- ఇండోసోలార్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రామచంద్ర యాదవ్ పోరాటం
- రామచంద్రయాదవ్ పిలుపుతో రోడ్ల మీదకు వచ్చిన వేలాది మంది రైతులు
- అడుగడుగునా పోలీసుల ఆంక్షలు
- రామచంద్రయాదవ్ కరేడుకు రాకుండా అడ్డుకునేందుకు విఫలయత్నాలు
- సముద్ర మార్గం గుండా కరేడుకు చేరుకొని జాతీయ రహదారి దిగ్బంధంలో పాల్గొన్న రామచంద్రయాదవ్
- రామచంద్రయాదవ్ కు రక్షణ వలయంగా నిలిచిన రైతులు
- ప్రాజెక్టు రద్దుకు సిఫార్సు చేస్తామని సబ్ కలెక్టర్ హామీ
- ప్రభుత్వ హామీతో ఆందోళనను విరమించిన రామచంద్ర యాదవ్
- మాట తప్పితే ఈసారి ఉద్యమం ఊహించలేనంత స్థితిలో ఉంటుందని హెచ్చరిక

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 29)**

అడుగడుగునా పోలీసుల ఆంక్షలు... అరెస్టు చేస్తామంటూ హెచ్చరికలు... రామచంద్రయాదవ్‌కు నోటీసులు... గ్రామ పెద్దలకు బెదిరింపులు. అయినా పోరాటం ఆగలేదు. ఊరు ఊరంతా కదిలింది. పోలీసుల ఆంక్షలను చేధించుకుంటూ... తమకు జరుగుతున్న అన్యాయాన్ని గొంతెత్తి నినదిస్తూ... రామచంద్రయాదవ్ అడుగులో అడుగయ్యారు. వేలాది మంది రైతులు. ప్రభుత్వం పచ్చని పొలాలను లాగేసుకుంటుంటే... అండగా ఉండి ప్రశ్నించాల్సిన ప్రతి పక్షం పట్టించుకోకపోతే... ఆ రైతులకు ఆపన్నహస్తంగా నిలిచింది బిసివై పార్టీ. పచ్చని పొలాలను కాపాడుతానని, రైతులకు అండగా ఉంటానని రామచంద్రయాదవ్ మాట ఇవ్వడంతో ఎంతో మంది రైతులు సంతోషించారు. జాతీయ రహదారిని దిగ్బందించి నిరసన సెగలు ప్రభుత్వానికి తగిలేలా చేసేందుకు రైతులంతా ఏకమయ్యారు. రామచంద్రయాదవ్ వస్తున్నాడని తెలిసి వందలాది మంది పోలీసులు ఆయన్ని నిలువరించేందుకు ప్రయత్నాలు చేశారు. ఆదివారం కందుకూరు నియోజకవర్గంలోని కరేడులో ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. కరేడు గ్రామంలో ఇండోసోలార్ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం 8300 ఎకరాల భూములను బలవంతంగా సేకరిస్తోంది. దీంతో గత కొంత కాలంగా ఆ గ్రామస్తులు, రైతులు ఆందోళనలు చేస్తున్నారు. దీంతో ఇటీవల బిసివై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ కరేడు గ్రామంలో పర్యటించారు. అక్కడున్న గ్రామస్తులతో మాట్లాడారు. ఒక సోలార్ ప్రాజెక్ట్ కోసం పచ్చని పొలాలను బలవంతంగా లాక్కోవడాన్ని ఆయన ఖండించారు. గ్రామస్తులకు మద్దతు ప్రకటించారు. అయితే ఆదివారం గ్రామస్తులు, రైతులు ఇండో సోలార్ ప్రాజెక్ట్ కు వ్యతిరేకంగా జాతీయ రహదారిని దిగ్బంధించాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమానికి బిసివై పార్టీ మద్దతు పలికింది. జాతీయ రహదారి దిగ్బంధం కార్యక్రమంలో రైతులతో కలిసి పాల్గొంటానని రామచంద్రయాదవ్ (తరువాయి 4లో...)



# మేత కోసం వలసబాట

## నెలల తరబడి ఊరు వదిలేస్తున్న వైనం
## పచ్చిక మొలకొచ్చాకే గ్రామాలకు ఏటా పశు పోషకులకు తప్పని ఇబ్బందులు



**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జూన్ 29)**

సంకలో సంచి..చేతిలో కర్ర..నెత్తిన టవలు.. ఎండనక.. వాననక..గాలనక.. మూగజీవాల వెంట పయనం..కొండలు, గుట్టలు, అడవుల్లో సంచారం. మధ్యాహ్నం ఎర్రటి ఎండలో చెట్టు కింద కాసేపు సేద. తిరిగి సాయంత్రానికి చెట్టు, పుట్ట చాటుకో చేరడం. ఇదీ గొర్రెలు, ఆవుల కాపరులు నిత్యం పడుతున్న ఇబ్బందులు. స్థానికంగా మూగజీవాల పోషణకు సరిపడా గ్రాసం, వాటిని మేపేందుకు బీడు భూములు లేకపోవడంతో గొర్రెలలు, ఆవుల కాపరులు అష్టకష్టాలు పాడుతున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గానికి చెందిన కొందరు గొర్రెలు, ఆవుల కాపరులు ఏటా పొలంబాట పడుతున్నారు. గ్రామంలోని అయిదారుగురు కాపరులు బఅందంగా ఏర్పడి గొర్రెలు, ఆవుల మందలతో బయలుదేరుతారు. పొలంబాటలో భాగంగా గ్రాసం, నీళ్లు ఎక్కడుంటే అక్కడికి వెళ్తున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాల్లో కలిపి ఆవులు 19,180 ఉండగా మేకలు, గొర్రెలు 3.50 లక్షలు దాకా ఉన్నాయి. దీంతో పశుగ్రాసం కోసం వలస వెళ్లి బీడు భూములు, అటవీ ప్రాంతం, కొండలు, గుట్టలు ఎక్కువగా ఉన్న మైదాన ప్రాంతాల్లో కనిపిస్తున్నారు. స్థానికంగా వీరికి గ్రామాల్లో తగినన్ని బీడు భూములు లేకపోవడం, చెరువులు, కుంటలు ఎండిపోవడం, అడవి, గుట్టలకు వెళ్లడానికి సరైన దారి సౌకర్యం లేకపోవడం తదితర కారణాలతో వీరంతా పశుగ్రాసం కోసం వలస బాట పడుతున్నారు. మే మొదటి వారం నుంచి పల్నాడుకు వలస వెళ్తున్నారు. వెళ్లే క్రమంలో వచ్చే గ్రామాల్లో ఒక్కో రోజు కాలం గడుపుతూ మేత ఉంటే మేపుకుంటూ తిరిగి ప్రయాణమవుతున్నారు. వర్షాలు సకాలంలో కురిసి, పచ్చని పొలాలు, బీడు భూములు పచ్చికతో పరుచుకున్నాక స్వగ్రామాలకు చేరుకుంటామని పుల్లలచెరువు మండలం పెద్ద పిఆర్‌సి తాండాకు చెందిన బాలు నాయక్, యర్రగొండపాలెం మండలంలోని పిల్లికుంట తాండాకు చెందిన వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు. తాము సుమారు పల్నాడు ప్రాంతంలో మూడు నెలలు పాటు పశువులను మేపుకొని కాలం కలిసి వచ్చిన తర్వాత తిరిగి తమ గ్రామాలకు చేరుకుంటామని త్రిపురాంతకం మండలం రామసముద్రం గ్రామానికి చెందిన మంత్రయ్య తెలిపాడు.



**రియల్ ఎస్టేట్‌తో ఇబ్బందులు....**

నియోజకవర్గ పరిధిలోని ప్రధాన గ్రామాల్లో చాలా భాగం వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ప్లాట్లుగా మారిపోవడం, ప్రభుత్వ, డీకేటీ భూములు అన్యాక్రాంతం కావడం, చెరవులు, కుంటలకు సమీపాన భూములున్న రైతులు వాటిని ఆక్రమించి సాగు చేయడం, చెరువులు, కుంటలు ఎండిపోవడం, గ్రామ సమీపంలోని కొండలు, గుట్టలు, అటవీ (తరువాయి 4లో...)

# స్కూల్ విత్ బెస్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ 2025 అవార్డు

## సొంతం చేసుకున్న మార్కాపురం రాక్ వెల్ స్కూల్
## అవార్డు అందుకున్న డైరెక్టర్లు వెన్న నాగార్జునరెడ్డి, సురా సంధుజ

**షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 29)**



స్కూల్ విత్ బెస్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ 2025 అవార్డును మార్కాపురం పట్టణానికి చెందిన రాక్ వెల్ స్కూల్ సొంతం చేసుకుంది. బెంగళూరులోని హెూటల్ కోర్ట్ యార్డ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 2025 సంవత్సరానికి గాను స్కూల్ విత్ బెస్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అవార్డును మార్కాపురం పట్టణానికి చెందిన రాక్ వెల్ స్కూల్ సాధించింది. ఈ సందర్భంగా రాక్వెల్ స్కూల్ డైరెక్టర్లు వెన్న నాగార్జున రెడ్డి, సురాసింధుజలకు ఈ అవార్డును అందజేశారు. ఈ అవార్డు పాఠశాలలోని విద్యార్థులకు అత్యున్నత స్థాయి మౌలిక సదుపాయాలను, సురక్షితమైన, ఆధునిక అభ్యాస వాతావరణాన్ని అందించడంలో పాఠశాల యొక్క అంకితభావానికి ప్రతిబింబంగా నిలుస్తోంది. భవిష్యత్తులో రాక్‌వెల్ స్కూల్ విద్య, మౌలిక సదుపాయాలలో రాణించడానికి ఈ అవార్డు ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు.

# కార్డన్ సెర్చ్‌లో 37 బైకులు, రెండు ఆటోలు, కారు సీజ్

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 29)**

పొదిలి పట్టణంలోని టైలర్స్ కాలనీలో ఆదివారం ఉదయం దర్శి డిఎస్పి బి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటిని తనిఖీ చేసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 37 మోటార్ బైకులు, (తరువాయి 4లో...)



# కదిలి వచ్చిన కరేడు















కూడా ప్రకటించారు. దీంతో ఆదివారం కరేడు గ్రామంలో భారీగా పోలీసులు మోహరించారు. ముందు రోజు రాత్రే గ్రామస్తులకు, గ్రామ పెద్దలకు నోటీసులు ఇచ్చార్ను. విజయవాడలో ఉన్న రామచంద్రయాదవ్ కు కూడా నోటీసులు ఇచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే గ్రామస్తులు, రైతులు ఉదయం పోలీసుల ఆంక్షలను చేదించుకుంటూ తమ సమస్య పరిష్కారం కోసం ముందడుగు వేశారు.

**జాతీయ రహదారిపై పోలీసులు..**

**సముద్ర మార్గం గుండా కరేడుకు రామచంద్ర యాదవ్**

రామచంద్రయాదవ్ వస్తున్నాడని తెలుసుకున్న పోలీసులు... కరేడు గ్రామంలో భారీగా మోహరించారు. దాదాపు 200 మందికి పైగా పోలీసులు గ్రామంలో ఆంక్షలు విధించారు. రామచంద్రయాదవ్ వస్తే జాతీయ రహదారి మీదే అడ్డుకోవాలని, గ్రామంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. అయితే ముందే విషయం తెలుసుకున్న రామచంద్ర యాదవ్... బోటులో సముద్రం గుండా ప్రయాణించి కరేడు గ్రామానికి చేరుకున్నారు. రైతులతో కలిసి దాదాపు మూడు కిలోమీటర్ల మేర కాలినడకన జాతీయ రహదారి దిగ్బంధానికి బయలు దేరారు. అయితే విషయం తెలుసుకున్న పోలీసులు మధ్యలోనే రామచంద్ర యాదవ్‌ను అడ్డుకునేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. రైతులు, మహిళలను అడ్డుకున్నారు. అయినా తమ నిరసనను శాంతియుతంగా తెలియజేస్తామని రామచంద్ర యాదవ్ కరాఖండీగా పోలీసులకు చెప్పుకొచ్చారు. దాదాపు గంటన్నర పాటు పోలీసులు అడ్డుకున్నా... కాలికి చెప్పులు కూడా లేకపోయినా మండు టెండలో అలాగే నిలబడి నిరసన వ్యక్తం చేశారు. రైతులు అడుగు ముందుకేసి పోలీసుల ఆంక్షలను చేధించుకుంటూ రామచంద్రయాదవ్ తో కలిసి జాతీయ రహదారిని దిగ్బందించారు.

**సబ్ కలెక్టర్ హామీ... మాట తప్పితే ఉద్యమం ఉధృతం**

ఇండో సోలార్ ప్రాజెక్ట్ కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రామచంద్ర యాదవ్‌తో సబ్ కలెక్టర్ మాట్లాడారు. ఆందోళన విరమించాలని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. రైతుల భూములను బలవంతంగా లాక్కోమని హామీ ఇస్తేనే నిరసన విరమిస్తామని రామచంద్రయాదవ్ తెగేసి చెప్పారు. దీంతో సబ్ కలెక్టర్ పై స్థాయి అధికారులతో మాట్లాడి భూములను బలవంతంగా తీసుకోమని, ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి ప్రాజెక్టును రద్దు చేసేందుకు సిఫార్సు చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో రామచంద్రయాదవ్ నిరసనను విరమించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల పచ్చని పొలాలను ఓ ప్రాజెక్ట్ కోసం లాక్కోవడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ప్రజల హక్కని, ఆ హక్కును కూడా కాలరాయాలని చూడటం దారుణమన్నారు. పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించడాన్ని ఆయన తప్పుబట్టారు. సబ్ కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్ట్ ను రద్దు చేయకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈసారి పోరాటం మహోద్యమంలా సాగుతుందన్నారు. ఎన్ని ఆంక్షలు విధించినా చెప్పిన మాట కోసం రైతులు పడుతున్న కష్టాలకు పరిష్కారం చూపడం కోసం వచ్చిన రామచంద్రయాదవ్‌కు కరేడు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## మేత కోసం వలసబాట

ప్రాంతానికి వెళ్లడానికి దారి సౌకర్యం లేకపోవడం తదితర కారణాలతో పశు పోషణకు వారికి సంబంధించిన ఆవులు, మేకలు, గొర్రెలు మేపుకోవడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గ్రామాల్లో పశు పోషకులే కాదు మిగిలిన రైతులూ పాడి పోషణపై ఎక్కువగా జీవిస్తున్నారు. ఈ క్రమంలో పాడి పోషకులు మాత్రం స్థానికంగా అందుబాటులోని వ్యవసాయ బోర్ల వద్ద గ్రాసం సాగు చేసి పోషిస్తుండగా, గొర్రెలు, మేకలు, ఆవుల కాపరులు మాత్రం గ్రాసం కోసం ఇబ్బందులు పడుతున్నారు. వీటిని అధిగమించే క్రమంలో స్థానికంగా ఉన్న ప్రభుత్వ, బీడు భూములను మూగజీవాల మేతకు కేటాయించాలని రైతులు ఏళ్ల తరబడి అటు పాలకులు, ఇటు అధికారులను కోరుతున్నా అరణ్య రోదనగానే మిగులుతోంది.

**పశు పోషణ పైనే ఆధారం....**

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 35 శాతం మంది ప్రజలు పశు పోషణపైనే ఆధార పడి జీవిస్తున్నారు. గొర్రెల మందలపై ఆధారపడి జీవిస్తున్న యాదవ కుటుంబాలు ఎక్కువగానే ఉన్నాయి. వీరికి ఒక్కొక్కరు వంద నుంచి 150 గొర్రెలు, మేకలు మేపుతున్నారు. ఈ క్రమంలో గ్రామానికి పది నుంచి పదిహేను కుటుంబాలు రెండు బఅందాలుగా ఏర్పడి పశు మందలతో పల్నాడు ప్రాంతానికి వెళ్తున్నారు. వెళ్లే క్రమంలో స్థానికంగా ఉన్న రైతులు వీరిని సంప్రదించి తమ పొలంలో రాత్రివేళలో గొర్రెల మందను తోలేలా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇందుకుగాను ఆ రైతు కాపరులకు మూడు పూటలా భోజనం పెడుతున్నారు. ఆ రోజుకు రైతులెవరూ ముందుకు రాకుంటే విశాలమైన ప్రాంతంలో రాత్రి పూట బస చేస్తున్నారు. ఆ రోజుకు కావాల్సిన వంటను వీరు వండుకోవడమో లేక సమీప గ్రామాలకు వెళ్లి తెచ్చుకోవడమో చేస్తున్నారు. ఏమైనా పశుగ్రాసం లేని కారణంగా తమ పశువులతో పల్నాడు ప్రాంతానికి తరలివెళ్లి మూడు నెలలు పాటు కుటుంబాలకు దూరంగా ఉండి పశువులను మేపుకోవాల్సి వస్తుందని పశు పోషకులు వాపోతున్నారు.

## కార్డన్ సెర్చ్‌లో 37 బైకులు, రెండు ఆటోలు, కారు సీజ్

రెండు ఆటోలు, ఒక కారును పోలీస్ స్టేషన్ కు తరలించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శి డిఎస్పి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వాహన చోదకులు సరైన పత్రాలతో కలిగిన వాహనాలు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఎవరైనా సరే వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దర్శి డిఎస్పి లక్ష్మి నారాయణ, పొదిలి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు, పొదిలి, తర్లుబాడు ఎస్ఐలు వి వేమన, బ్రహ్మనాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.









## ఆవులమంద పై పెద్ద పులి దాడి

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, జూన్ 29)**

ఆవులమందపై పెద్ద పులి దాడి యర్రగొండపాలెం మండలం పాలుట్ల గిరిజన గూడెంలో అలజడి రేపింది. పాలుట్ల గిరిజన గూడెంలో మరోసారి ఆవుల మంద దొడ్డి పై దాడి చేసిన పెద్ద పులి. రెండు ఆవులను పెద్ద పులి చంపిందని స్థానికులు తెలిపారు. పెద్ద పులి మళ్ళీ దాడి చేయడంతో పాలుట్ల గిరిజనులు భయాందోళనలో ఉన్నారు. ఈ మధ్య పెద్ద పులి దాడిలో రెండు ఆవులు చనిపోయాయి. వరుసగా పాలుట్ల గిరిజన గూడెంలో పెద్ద పులి దాడులు చేసి ఆవులను చంపుతుండడంతో దిక్కు తోచని స్థితిలో గ్రామస్తులు ఉన్నారు. నల్లమల దట్టమైన ఆటవీప్రాంతం మధ్యలో పాలుట్ల గిరిజన గూడెం ఉండడంతో క్రూరమృగాలకు నిలయంగా మారింది ఆటవీప్రాంతం. ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకోవాలి అంటున్న గ్రామస్థులు.

# శ్రీ వేణుతల కాటంరాజు గంగాభవాని ఆలయంలో చేపట్టాల్సిన కార్యక్రమాల పై సమీక్ష

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జూన్ 29)



శ్రీ వేణుతల కాటంరాజు గంగాభవాని దేవస్థానం వద్ద భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మ గంగరాజు యాదవ్ ప్రధాన కార్యదర్శి బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్ ఆదివారం పరిశీలించారు. త్వరలో ఆలయం పరిసర ప్రాంతాల్లో సుమారు 18 లక్షల రూపాయల వ్యయంతో ఓవర్ హెడ్ ట్యాంక్ విత్ పవర్ బోరు ఏర్పాటు చేయిస్తానని ఎర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మాజీ లిడ్ క్యాప్ చైర్మన్ ఎరిక్సన్ బాబు హామీ ఇవ్వడంతో అందుకు సంబంధించిన స్థలాన్ని కూడా కమిటీ పర్యవేక్షించారు. ప్రతి గురు, ఆదివారాల్లో వస్తున్న వందలాది మంది భక్తులకు సరైన సౌకర్యాలను మెరుగుపరచడం కోసము , వారి మొక్కులు తీర్చుకొనుటకు ఇప్పటివరకు ఉన్న ఆలయం ముందు భాగం కాకుండా ఇంకొంచెం తూర్పు వైపునకు ఏర్పాటు చేయుటకు స్థలాన్ని కొలత వేయడం జరిగింది.అదేవిధంగా ఇప్పటికే 25 లక్షల రూపాయలతో ప్రారంభించిన భోజనాశాలను ఇంకా అభివృద్ధి చేయుటకు అనేకమంది యాత్రికులు ముందుకు వస్తున్న సందర్భంలో అనంతరం కమిటీ సమావేశంలో తీర్మానించి సంబంధిత కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది.మంచినీటి వసతి లేక ,ఇబ్బందులు పడుతున్న భక్తుల దాహార్తిని తీర్చేందుకు సుమారు నాలుగు లక్షల రూపాయలు వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయుటకు భక్తులు ఎవరైనా ఉంటే కమిటీ చైర్మన్ నెంబర్ 9966401 003 మరియు ఆలయ కమిటీ ముఖ్య బాధ్యులు పిఎల్పి యాదవ్ 9966595555 నంబర్లకు ఫోన్ చేసి వివరము తెలపాలి అన్నారు.

ఆలయ పునర్నిర్మాణాన్ని కూడా సంబంధిత పండితులను,స్థపతులను సంప్రదించి పునః నిర్మాణ కార్యక్రమాలను చేపట్టిన కూడా కమిటీలో ఏర్పాటు చేసినటువంటి అజెండా ద్వారా చర్చించి ముందుకు వెళ్తామని ఆలయ కమిటీ చైర్మన్ తెలియజేశారు. ఆ స్థలానికి సరైన హద్దులు చూపించి హద్దురాళ్ళు వేసుకునే సర్వే జరిపించి సహకరిస్తామని మార్కాపురం సబ్ కలెక్టర్ హామీ ఇచ్చి ఉన్నారు. ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్నా భక్తులు ముందుకు వస్తున్నటువంటి పరిస్థితుల్లో సర్వే జరపని కారణంగా అనేక ఇబ్బందులను కమిటీ ఎదుర్కొంటున్నది. యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ,మాజీ లిడ్ క్యాప్ చైర్మన్ శ్రీ ఎరిక్సన్ బాబు కాటంరాజు స్వామి మీద భక్తితో, సహకరించి సుమారు పది లక్షల రూపాయల వ్యయంతో 30 ఎలక్ట్రికల్ స్తంభాలు, వైర్లను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలను అలంకరించినటువంటి సందర్భంగా కమిటీ వాటన్నిటినీ పరిశీలించి అందుకు సహకరించిన ఎరిక్షన్ బాబుకు అభినందనలు తెలియజేశారు. కమిటీ భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి చేసే కార్యక్రమాల్లో తమ తమ గ్రామాల్లో నుంచి పూర్తి ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తామని వివిధ గ్రామాల నుంచి వచ్చినటువంటి వారు తెలిపారు. భవిష్యత్తులో యాదవ,యాదవేతర భక్తుల పూర్తి సహాయ సహకారాలతో నూతనంగా ఆలయాన్ని పెద్ద స్థాయిలో నిర్మించడానికి ఇప్పటికే సంబంధిత మేధావుల యొక్క సలహా సంప్రదింపుల పూర్తిస్థాయిలో ఆలయ పునర్నిర్మాణం గురించి ప్రకటన జారీ చేస్తామని కమిటీ చైర్మన్ గుమ్మా గంగరాజు యాదవ్ ఆలయ కమిటీ ముఖ్య బాధ్యులు పిఎల్ పి యాదవ్ తెలియజేశారు. ఈనాటి ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్ రియల్, సుంకేసుల పాముల పోల్రాజు పెద్దిరాజు యాదవ్, రాగాల ఈశ్వర్ యాదవ్, పాలంకయ్య యాదవ్ లతోపాటు పలువురు యాదవ సోదరులు పాల్గొన్నారు.

# ఐటిడిపి కమిటీ సభ్యుల ఎన్నిక

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 29)

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆదేశానుసారం ఒంగోలు నియోజకవర్గ ఐటిడిపి సభ్యులు ఆదివారం ఉదయం పాత మార్కెట్ సెంటర్ పాత హిందూస్థాన్ హోటల్ వద్ద సమావేశమై ఒంగోలు టౌన్ ఐటిడిపి కమిటీ, ఒంగోలు నియోజకవర్గ ఐటిడిపి కమిటీ , కొత్తపట్నం మండల ఐటిడిపి నూతన పూర్తి స్థాయి ఐటిడిపి కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ప్రతిపక్షంలో ఎన్నో బాధలను ఎదుర్కొని సోషల్ మీడియాలో అప్పటి వైసీపీ పార్టీ మీద పోరు బాట చేస్తూనే, పార్టీ లో ఐటిడిపి సభ్యులు పార్టీ పిలుపు నిచ్చే ప్రతి పనిలో క్రియాశీలకంగా ఉంటూ పార్టీ కి వెన్నుదన్నుగా నిలిచారు... 2022 లో టిడిపి సభ్యత్వ నమోదులో, 2024 టిడిపి సభ్యత్వ నమోదులో ఐటిడిపి సభ్యులు పాత్ర వెలకట్టలేనిది. కుటుంబ సాధికార సభ్యులను నియమించడంలో, ఓటర్ వెరిఫికేషన్ చెయ్యడంలో, పార్టీ కార్యకర్తలను చైతన్య పరచడంలో ఐటిడిపి సభ్యులు తమ కర్తవ్యాన్ని సమర్ధవంతంగా నిర్వర్తించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు గారి పిలుపే శాసనంగా ఐటిడిపి సభ్యులు తమకు అప్పజెప్పిన ప్రతి పనిని తుచ తప్పకుండా పార్టీ నియమ నిబంధనలు పాటిస్తూ పార్టీ గెలుపులో ఐటిడిపి సభ్యులు పాత్ర మరువలేనిది అన్నది అక్షర సత్యం ఇది తెలుగుదేశం ప్రతి బూత్ ఇంచార్జి చెప్పే మాట. ఇలా అన్ని విషయాలలో పార్టీ కోసం కష్ట పడ్డ ఐటిడిపి సభ్యులు ఈ నూతన ఐటిడిపి కమిటీ కూడా రానున్న సంస్థాగత ఎన్నికల్లో ఒంగోలు శాసన సభ్యులు శ్రీ దామచర్ల జనార్ధన్ రావు గారి అడుగు జాడల్లో నడుస్తూ అనునిత్యం పార్టీ కోసం మా ఐటిడిపి నూతన కమిటీ కూడా పని చేస్తుంది అని ఐటిడిపి సభ్యులు ఘంటా పదంగా చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ఐటిడిపి ప్రధాన కార్యదర్శి గోపు వీరాంజనేయులు, ఒంగోలు నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు మన్నేపల్లి హరికృష్ణ, కొత్తపట్నం మండల ఐటిడిపి అధ్యక్షులు వాయల మల్లిఖార్జున మరియు ఒంగోలు టౌన్ ఐటిడిపి అధ్యక్షులు భార్గవ్ సాయి, శ్యామ్, జిన్ని దివాకర్, జగదీష్, అరిఫా, నాగ మల్లీశ్వరి, దొండపాటి లక్ష్మణ్, సురేంద్ర, సంషుద్దీన్, ఐటిడిపి నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.






# ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌కు బ్రీత్ అనలైజర్ మిషన్ అందజేత

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 29)

ఒంగోలు ఆర్ఎస్ దాబా యజమాని తాళ్లూరి రవి తాలూకా పోలీస్ స్టేషన్‌కు సుమారు రూ.40 వేలు విలువ గల డ్రంకన్ టెస్ట్‌కి ఉపయోగించే బ్రీత్ అనలైజర్ మిషన్‌ను తాలుకా సిఐ విజయ్‌కృష్ణకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా రవి కి సిఐ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎవరైనా నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు

## చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించిన ప్రకాశం జిల్లా పోలీసులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 29)

నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ. ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు పలు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉన్నా చెడు నడత కలిగిన వ్యక్తులు, పాత నేరస్థులు, షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీస్ అధికారులు షీటర్ల యొక్క జీవనాధారం మరియు ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన యెడల చట్టాన్ని అతిక్రమించి దౌర్జన్యాలు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదని, ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. ఒక వ్యక్తి మీద షీట్ ఉన్నప్పుడు దాని ప్రభావం తనపై, కుటుంబపై కూడా ఉంటుందని, ఈ చెడునడత కలిగిన ఇమేజ్ నుంచి బయటపడాలని, సత్ప్రవర్తన ఒక్కటే మార్గమని, అందరితో కలసిపోయి మంచిగా జీవనం సాగించాలన్నారు. షీటర్లు వ్యవహార శైలి మార్చుకోకపోయినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, చట్టాన్ని అతిక్రమించి దౌర్జన్యాలు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించి కౌన్సిలింగ్ నిర్వహించారు.

# ఉచిత నేత్రవైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 29)

కృష్ణవేణి, ఎస్వీఆర్ డిగ్రీ కళాశాల వారి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని టిడిపి సీనియర్ నాయకులు, మాచర్ల మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మాచర్ల పట్టణంలో స్థానిక ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం, ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని యాగంటి మల్లికార్జున రావు ప్రారంభించారు. వైద్య శిబిరంలో 150 మందికి పైగా తమ ఆరోగ్య స్థితిపై అవగాహన పెంచుకున్నారు. ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని కేరళ రాష్ట్రానికి చెందిన ప్రముఖ వైద్య కేంద్రమైన, శ్రీధరీయం ఆయుర్వేదిక్ పంచకర్మ వారి వైద్యులు డాక్టర్ కృష్ణ దాస్, వారి సిబ్బంది పాల్గొని, ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వారికి విలువైన సూచనలను సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యనమదల వెంకట్రామయ్య, డైరెక్టర్స్ సుబ్బారావు, శ్రీనివాసరావు, న్యాయవాది మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులను కాలరాస్తూ తీసుకొస్తున్న కోడ్లు రద్దు చేయాలి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 29)




కేంద్రంలోని బిజెపి కూటమి ప్రభుత్వం కార్పోరేట్ల ప్రయోజనాలకోసం కార్మిక హక్కులను కాలరాస్తూ తీసుకొస్తున్న లేబర్ కోడ్లను రద్దుచేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ స్వతంత్ర ఫెడరేషన్స్ పిలుపు ఇచ్చిన జూలై 9 దేశవ్యాప్త సమ్మెలో జిల్లాలోని ఉద్యోగ, కార్మికులందరూ పాల్గొనాలని సిఐటియు, ఎఐటియుసి, ఐయఫ్.టి.యు, ఐ.యన్. టి.యు.సి, ఎ.ఐ.యఫ్.టి.యు. యల్.ఐ.సి., బి.యస్.యన్.యల్. సంఘాలు జిల్లా ఉమ్మడి సమావేశం పిలుపుఇచ్చింది.ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి కె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన సిఐటియు జిల్లా ఆఫీసులో జరిగిన కేంద్ర కార్మిక సంఘాలు,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల స్వతంత్ర ఫెడరేషన్ల జిల్లాకమిటీల నిర్ణయాలను సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యం.రమేష్ పత్రికలకు విడుదల చేశారు.కార్పోమ్సరేట్ల ప్రయోజనాలను కోసం కార్మిక హక్కులను కాలరాస్తూ 29 కార్మిక చట్టాలను సవరించి 4 లేబర్ కోడ్స్ తెచ్చింది.లేబర కోడ్స్ తెచ్చింది. లేబర్ కోడ్స్ అమలు చేస్తే కార్మికులు బేరసారాలు శక్తిని కోల్పోతారు.యూనియన్ పెట్టుకొనే హక్కుసమ్మె హక్కు కోల్పోతారు.కార్మికుల సమ్మెను చట్టవిరద్ధ సమ్మెగా ప్రకటించీ ఒకరోజు సమ్మె కు 8రోజల వేతనాలను కోతవిధిస్తున్నారు. లేబర్ కోడ్స్ అమలులోకి రాకముందే రాష్ట్రంలో టి.డి.పి.కూటమి ప్రభుత్వం 8గంటల పనిధినంకి తూట్లు పొడుస్తూ 10గంటల పనిధినం జీఓ తీసుకొచ్చి కార్మికులను యజమానులకు బానిసలుగా మారుస్తుంద న్నారు.ఓటిని 140గంటలకు పెంచడం,మహిళలను రాత్రి షిఫ్టుల్లో పనికి అనుమతించడం కార్మికవర్గం పై పాలకవర్గాలు దాడీకి నిదర్శనమన్నారు.మరొక వైపు ప్రభుత్వరంగ సంస్థలు కారుచౌకగా కార్పోరేట్లకు కట్టబెడు తుందన్నారు.గత 4 సంవత్సరాలుగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతుంటే కేంద్రప్రభుత్వం వెనక్కు తగ్గకపోవడం దాని వైఖరికి నిదర్శనమన్నారు.స్కీంవర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయకపోగా పనిభారం పెంచుతుందన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ , ఉద్యోగ భద్రత లేదన్నారు.సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును సైతం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లంఘిస్తున్నాయన్నారు.కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయటంలేదు.అసంఘటితరంగకార్మికుల సంక్షేమానికి సమగ్రచట్టం రూపొందించలేదు.రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలులేక అప్పులలో కూరుకుపోయి రైతాంగం ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులలో కోతపెడుతూ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. ఈ స్థితిలో జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో ఉద్యోగులు కార్మికులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐయఫ్టియు జిల్లా ప్రధానకార్యదర్శి యం యస్ సాయి, ఐయన్టియుసి జిల్లా అధ్యక్షులు యు.శ్రీనివాసరావు, ఐ యఫ్ టి యు జిల్లా అధ్యక్షులు వెంకట్రావు,సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి మహేష్ ,నాయకులు తంబి శ్రీనివాసులు, యల్.ఐ.సి.యూనియన్ నాయకులు పారా శ్రీనివాసులు, ఎఐబిడిపిఎ జిల్లా కార్యదర్శి జి.నాగేశ్వరావులు పాల్గొన్నారు.

---

# మహా న్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయం దాడి ఘటన హేయం

## ఆంధ్రప్రదేశ్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు యం.రాజా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 29)



మహా న్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై చోటు చేసుకున్న దాడి గర్హనీయం. మీడియాలో ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే వార్తలు, కథనాలపై అభ్యంతరాలు ఉంటే తెలియచేసే విధానం ఒకటి ఉంటుంది. ఇందుకు భిన్నంగా దాడులకు పాల్పడటం సమంజసం కాదు. మహా న్యూస్ ఛానెల్ పై జరిగిన దాడిని ప్రజాస్వామ్యవాదులు తప్పనిసరిగా ఖండించాలి. ఈ దాడికి కారకులైనవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఏపీఐజేల రాష్ట్ర అధ్యక్షుడు యం రాజా డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బందిపై హత్యాయత్నానికి పాల్పడ్డ బిఆర్ఎస్ పార్టీ తీరును ఆంధ్రప్రదేశ్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు యం రాజా తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు మేరకు తన విధుల్ని నిర్వహిస్తున్న మీడియాపై ఇలాంటి దాడులు అప్రజాస్వామికమన్నారు. తీవ్ర అభ్యంతరకరం వార్తలు కథనాలపై అభ్యంతరాలు అభ్యంతరాలు ఉంటే, రాతపూర్వక ఖండించవచ్చు, ప్రసారం చేయమని ఒత్తిడి తేవచ్చు, లేదా తమ పరువుకు భంగం కలిగిస్తుందని భావిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు, మరి ఇలా భౌతిక దాడులకు పాల్పడడం సరైన పద్ధతి కాదని మీడియా స్వేచ్ఛ ను స్వాతంత్రాన్ని నీరుగార్చలేరని నాయకులు తెలుసుకోవాలన్నారు. మహాన్యూస్ సంస్థకు, సిబ్బందికి, మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణకు యూనియన్ తరపున సంఘీభావం ప్రకటిస్తున్నామని ఏపీఐజేఏ రాష్ట్ర అధ్యక్షుడు యం రాజా పేర్కొన్నారు.

# కార్య సాధకుడు ఎరిక్షన్ బాబుకి కృతజ్ఞతలు






(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం , జూన్ 29)

ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉండి శిథిలావస్థకు చేరిన శివాలయ అనుబంధ కోనేరును పునరుద్ధరణ చేస్తున్న యర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబుకి యర్రగొండపాలెం శివాలయం అభివృద్ధి కమిటీ కన్వీనర్ రెంటచింతల శ్రీ రామ చంద్రమూర్తి (పూజారి రామయ్య) బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అయ్యలరాజు యోగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం కోనేరు పునరుద్ధరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన బ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడారు.. పూజారి రామయ్య మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల చరిత్ర ఉన్న శివాలయం అనుబంధ కోనేరు ఆలనా పాలన లేకుండా శిథిలావస్థకు చేరడంతో కొనేరును బాగు చెయ్యమని అనేక మంది అధికారులను, నాయకులను కలసి విన్నవించామని కానీ ఎవరూ సరిగ్గా స్పందించలేదని కానీ ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు బ్రాహ్మణలకు, శివాలయం ఆలయ కమిటీ సభ్యులకు కోనేరు పునరుద్ధరణ, మరియు బ్రాహ్మణలు నిత్య కర్మలు జరుపుకొనుటకు స్థలం మంజూరు చేయిస్తానని మాట ఇచ్చారని ఆ మాట ప్రకారం నేడు కోనేరు పునరుద్ధరణ కార్యక్రమంనకు శ్రీకారం చుట్టడం యావత్తు యర్రగొండపాలెం ప్రజలకు సంతోషదాయకమని అన్నారు. అయ్యలరాజు యోగేశ్వరరావు మాట్లాడుతూ.. పట్టణ నడి బొడ్డులో ఉన్న కోనేరు సుందరీకరణ చేస్తే అది ప్రజలకు మనో వికాస కేంద్రం గా పని చేస్తుందని అన్నారు. బ్రాహ్మణులకు ఇచ్చిన మాట ప్రకారం మొదట కోనేరు బాగు చెయ్యడం గొప్ప విషయమని అలాగే నిత్య కర్మలు చేసుకొనుటకు స్థలం మంజూరు చేయిస్తే యావత్తు బ్రాహ్మణ సమాజం ఎరిక్షన్ బాబుకి రుణపడి ఉంటుందని అన్నారు.

# మర్రిచెట్టు సంఘంలో కరెంటు షార్టేజి ఇల్లు దగ్ధం

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 29)



ఉలవపాడు మండల పరిధిలోని కరేడు పంచాయతీ మర్రిచెట్టు సంఘంలో ఆదివారం విద్యుత్ షార్టేజీతో ఇల్లు దగ్ధం అయిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మర్రిచెట్టు సంఘంలో గంపాల వెంకటేశ్వర్లు భార్య కృష్ణవేణి నివసిస్తున్నటువంటి ఇంట్లో విద్యుత్ షార్టేజీ వచ్చినందువల్ల ఇల్లు, ఇంట్లో ఉన్నటువంటి బీరువా మంచం బట్టలు ఫోన్ వంట సామాను మొత్తం తగలబడిపోయాయి. ఈ సమాచారం తెలుసుకున్నటువంటి అలగాయపాలెం టిడిపి నాయకులు వెంటనే ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావుకి సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు పొడపాటి సుధాకర్ అక్కడ నాయకులకు ఫోన్ చేసి కొంత నగదు, బియ్యం బస్తా, నిత్యవసర వస్తువులు అందజేశారు. ఆ ప్రదేశానికి వెళ్లి ఆ కుటుంబాన్ని టిడిపి నాయకులు ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కోమట్ల వెంకట్రామిరెడ్డి, గుమ్మడి శీను, వాయిల శీను, వాయిల రాము, పాదాల నాగిరెడ్డి, పుడమేకల సుబ్రహ్మణ్యం, కోమట్ల స్వామిరెడ్డి, కోమట్ల పెద్ద వెంకటరామిరెడ్డి, కోమట్ల ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.





# తెనాలి దళితుల ఖాకీ హింస ఘటన పై

# జులై 12న ఒంగోలులో సదస్సు



## రెడ్‌బుక్ రాజ్యాంగంపై సమీక్ష

## దళిత నేత నీల నాగేంద్రరావు వెల్లడి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 29)**

మూడు నెలల క్రితం తెనాలిలో నడిరోడ్డుపై రెడ్ బుక్ రాజ్యాంగం అమల్లో భాగంగా దళిత యువకులపై కూటమి ప్రభుత్వ ఖాకి హింసకు వ్యతిరేకంగా జులై 12వ తేదీన ఒంగోలులో సదస్సు నిర్వహిస్తున్నామని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఆదివారం తెలిపారు. స్థానిక సమితి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నీలం నాగేంద్రం మాట్లాడుతూ తెనాలి నడిరోడ్డులో దళిత ముస్లిం యువకులపై తాలిబాన్ తరహా పోలీస్ పోలీస్ థర్డ్ డిగ్రీ వీడియో వైరల్ అయిన బాధ్యులైన సిఐలు రాముల నాయక్ రమేష్ బాబులపై ఎస్సీ ఎస్టీ కేసు కట్టలేదు అన్నారు. అలాగే ఈ దాడిని చేయించిన గుంటూరు ఎస్పీ ని సస్పెండ్ చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వ ఖాకి హింసపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నా కూటమి ప్రభుత్వం పోలీస్ హింసకు గొడుగు పడుతుందన్నారు. 2020 సంవత్సరంలో ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్లో నమోదైన క్రైమ్ నెంబర్ 38/20 ఎస్సీ ఎస్టీ కేసులో దాసరి మాల్యాద్రి అనే దళితుడిని డబ్బులు విషయమై అవమానించి వేధించిన ఘటనలో రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ నరహరి మరియు ఎస్సీ వర్గానికే చెందిన మద్రి లక్ష్మణ్ అనే తాలూకా సిఐ లను కరోనా సమయంలో కూడా అరెస్టు చేశారన్నారు. ఒంగోలు వన్ టౌన్ లో నమోదైన క్రైమ్ నెంబర్ 32/21 కేసులో కట్ట వినయ్ కుమార్ అనే దళిత యువకుడిని కొట్టిన కేసులో అప్పుడు ఎస్ఐ సమందర్ వలి పై కేసు నమోదు చేసి ప్రభుత్వం విచారణ జరిపిందన్నారు. రేణంగివరం పోలీస్ స్టేషన్లో నమోదైన 4/2016 ఎస్సీ ఎస్టీ కేసులో గోళ్ళమూడి తిరుపాల్ అనే దళితుడిని పోలీస్ స్టేషన్లో కొట్టిన కేసులో రేణింగివరం ఎస్సై బలగాని జగన్ మోహన్ రావు మరియు కాసా కిరణ్ కుమార్ అనే కానిస్టేబుల్ లకు ఒంగోలు ఎస్సీ ఎస్టీ కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది అన్నారు. ఎస్సీ ఎస్టీలను పోలీసులు కొట్టిన తిట్టిన అవమానించిన ఎస్సీ ఎస్టీ ఆక్ట్ ప్రకారం శిక్షలు పడతాయి అన్నారు.పోలీసులకు కొట్టే అధికారం ఉంటే కోర్టులు శిక్షలు ఎందుకు వేస్తున్నారు అదే పోలీస్ స్టేషన్ లో కేసులు ఎందుకు నమోదు చేస్తున్నారన్నారు. పోలీసులు కొడితే తప్పేమిటన్న హెూం శాఖ మంత్రి అనిత హెూం మంత్రిగా తనకున్న విశేష అధికారాలతో కోర్టులు పోలీసులకు వేసిన శిక్షలను రద్దు చేయించగలరా అన్నారు. గత ప్రభుత్వంలో బ్యాంకులకు వేలకోట్లు ఎగగొట్టిన రఘురామకృష్ణరాజు సి బి సి ఐ డి కార్యాలయంలో తెనాలి దళిత యువకులు లాగానే అరికాళ్లపై పోలీస్ కోటింగ్ ఇచ్చారని ఈ ప్రభుత్వంలో కేసు నమోదు చేయటం కుల వివక్ష కాదా అన్నారు. డీజీపీ రేసులో ఉన్న పీవీ సునీల్ కుమార్ ను రఘురామకృష్ణ రాజును కొట్టిన ఘటనలో బాధ్యుడిని చేస్తూ కూటమి ప్రభుత్వం సస్పెండ్ చేసిందన్నారు. చివర ఆఖరికి దళిత మహిళా వైద్యురాలు ప్రభావతికి కూడా సుప్రీంకోర్టులో బెయిల్ రాకుండా కూటమి ప్రభుత్వం అడుగడుగునా అడ్డుపడుతుందన్నారు. రాజ్యాంగ మరియు చట్టాలను పక్కనపెట్టి దళితులను హింసించే పోలీసులపై కేసులు కట్టవద్దని కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా రహస్యంగా చట్టం ఏమైనా చేసిందా అనే అనుమానం కలుగుతుంది అన్నారు. కూటమి ప్రభుత్వం నియమించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ గాని సభ్యులు గాని తెనాలి దళిత యువకుల కూటమి ప్రభుత్వ రాజ్య హింసపై కన్నెత్తి చూడలేదన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ రాష్ట్ర డిజిపి పంపించిన నోటీస్ ఈనెల 22వ తేదీన అందిన తమకు గడువు కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిందన్నారు. హైకోర్టులో కూడా ఓటమి ప్రభుత్వ పోలీస్ బాధితుడైన జాన్ విక్టర్ తండ్రి హైకోర్టులో వేసిన పిటిషన్ విచారణ దశలో ఉందన్నారు ఈ నేపథ్యంలో జులై 12వ తేదీన ఒంగోలు అంబేద్కర్ భవన్లో కూటమి ప్రభుత్వ రాజ్యాంగ పాలనకు వ్యతిరేకంగా తెనాలి దళిత యువకుల పై పోలీస్ అమానుష చట్ట వ్యతిరేక దాడిని నిరసిస్తూ సదస్సు నిర్వహిస్తున్నామని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నేల నాగేంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు రారా అంజయ్య, కార్యదర్శి కాకుమాను రవి ఇతర సంఘాల నాయకులు కసుకుర్తి ఆమెన్ రాజ్, ధర్నెపూడి యోహాన్, ఎర్ర మోతు నారాయణ, అక్కయ్య తదితరులు ఉన్నారు.

# అమరావతి రథయాత్రలో పాల్గొన్న గోనుగుంట్ల లీలావతి





**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 29)**

విజయవాడ ఇస్కాన్ ఆధ్వర్యంలో అమరావతి రథయాత్ర మహెూత్సవ కార్యక్రమం ఆదివారం భవానిపురం సీతానగరంలో అంగరంగ వైభవంగా జరిగింది. జగన్నాథ రథయాత్ర భక్తి పారవశంతో సాగగా ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు సతీమణి గోనుగుంట్ల లీలావతి పాల్గొన్నారు. రథయాత్రకు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనగా సితార కూడలి నుంచి సీతమ్మ వారి పాదాల సెంటర్ వరకు మహిళా భక్తులతో యాత్రలో పాల్గొని కొలువుతీరిన జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవత మూర్తులకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.





# రాష్ట్ర టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే ఇంటూరి



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 29)**

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఆదివారం జరిగిన రాష్ట్ర టిడిపి విస్తృతస్థాయి సమావేశంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, మరి ఇతర ప్రజాప్రతి నిధులతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నేతలకు సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచారం పై చర్చ. జులై 2 నుంచి సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచారం నిర్వహణ. పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై నేతలతో చంద్రబాబు నాయుడు మాట్లాడారు.



# బిజెపి కార్యాలయంలో మన్‌కీ బాత్







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 29)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం జూన్ 29న "మన్ కీ బాత్" కార్యక్రమం 123వ ఎపిసోడ్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమం ఉదయం 11గంటలకు ఆకాశవాణి, దూరదర్శన్‌లో ప్రత్యక్షంగా ప్రసారమైంది. పొదిలి మండల బిజెపి కార్యాలయం నందు ప్రకాశం జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, పొదిలి పట్టణ అధ్యక్షుడు యుద్ధం మహేష్, ఇతర నాయకులు విద్యార్థినీ, విద్యార్థులు కలసి ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ దేశ ప్రజలతో తన మనసులోని భావాలను పంచుకున్నారు. ఈ రోజు కార్యక్రమంలో కొన్ని కీలక అంశాలపై దృష్టి సారించారు. ముఖ్యంగా ఇటీవల జరిగిన యోగా దినోత్సవాన్ని ప్రధాని మోదీ మెచ్చుకున్నారు. దేశవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని ఎంతో శ్రద్ధతో నిర్వహించారని మెచ్చుకున్నారు. పదేళ్ల కిందట యోగా దినోత్సవం ప్రారంభమైందన్న మోదీ ఏటా యోగా దినోత్సవంలో పాల్గొనే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది అన్నారు. ప్రజలు తమ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకున్నారని తెలిపారు. విశాఖపట్నంలో 3 లక్షల మంది ఒకేసారి యోగా చేశారని మోదీ గుర్తుచేశారు. తద్వారా గిన్నీస్ రికార్డ్ సాధించారని తెలిపారు. అలాగే.. 2వేల మందికి పైగా గిరిజన విద్యార్థులు.. 108 సూర్య నమస్కారాలు చేసి మరో గిన్నీస్ రికార్డు సాధించారని మోదీ గుర్తుచేశారు. అలాగే దేశంలో ఎమర్జెన్సీ విధించిన వారు రాజ్యాంగాన్ని హత్య చేసి, న్యాయ విభాగాన్ని బానిసగా మార్చుకోవాలనుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. నాడు జార్జిఫెర్నాండెజ్‌ను సంకెళ్లతో బంధించారని గుర్తు చేశారు. కానీ, భారత ప్రజలు శక్తిమంతమైన వారు కావడంతో ఎమర్జెన్సీ తొలగిపోయిందని, దానిని విధించినవారు ఓడిపోయారని గుర్తు చేశారు. దేశంలో ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తవడాన్ని మన్‌కీ బాత్‌లో ప్రస్తావించిన ప్రధాని, ఎమర్జెన్సీపై పోరాడిన మొరార్జీ దేశాయ్, వాజ్‌పేయి, బాబూ జగ్జీవన్ రామ్ వంటి నేతల ప్రసంగాలను మోదీ ప్రస్తావించారు. ఎమర్జెన్సీపై పోరాడిన వారిని కచ్చితంగా స్మరించుకోవాలనీ అది రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మనల్ని ప్రేరేపిస్తుందన్నారు. భారత జనాభాలో 64 శాతం కన్నా ఎక్కువ మంది దాదాపు 95 కోట్లమంది ఏదో ఒక సామాజిక రక్షణ పథకంతో లబ్ధి పొందుతున్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ తెలిపిందని ప్రధాని నరేంద్రమోదీ వివరించారు. 2015లో సామాజిక రక్షణ ఫలాలు కేవలం 25 కోట్ల మందికి అందేవని గుర్తుచేశారు. శాశ్వత అంధత్వానికి దారితీసే ట్రాకోమా వ్యాధి నుంచి భారత్ పూర్తిగా విముక్తి పొందినట్లు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ- డబ్ల్యూహెచ్‌వో నిర్ధారించిందని 123వ మన్‌కీబాత్ ఎపిసోడ్‌లో మోదీ తెలిపారు. మొరార్జీ దేశాయ్, వాజ్పేయి , బాబు జగజీవన్ రామ్ వంటి నేతల ప్రసంగాలను మోదీ వినిపించారు. ఎమర్జెన్సీ పై పోరాడిన వారిని తప్పకుండా గుర్తు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు, ఫుట్బాల్ ఆటగాళ్లకు కేంద్రంగా మారిన బోడోలాండ్ ను ప్రధాని అభినందించారు, వారు పరిమిత వనరులతోనే అద్భుతంగా రాణిస్తున్నారని, దేశంలోని చిన్నారులకు ఆదర్శంగా మారారని కొనియాడారు. ఆరోగ్యం కోసం, ఊబకాయాన్ని తగ్గించుకోవడానికి ఆహారంలో నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించుకోవాలని సూచించారు. మేఘాలయలోని ఏరి సిల్క్ కు జి ఐ ట్యాగ్ లభించిందని, పురుగులను చంపకుండా వస్త్రాన్ని తయారు చేయడం దీని ప్రత్యేకత అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్లోని పల్నాడు జిల్లాలో బౌద్ధ క్షేత్రాలకు విదేశాల్లో అత్యంత ప్రాధాన్యం ఉందని చెప్పారు. అందరూ తమ ప్రాంతాల్లోని బౌద్ధ క్షేత్రాలను ఒక్కసారైనా సందర్శించాలని సూచించారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న సుభాన్షు శుక్లాకు ప్రధాని అభినందనలు తెలిపారు.

## పదవి విరమణ చేసిన ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 29)**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి పదవి విరమణ పొందిన బినిడి వెంకట్రావుకి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దామచర్ల పూర్ణచంద్రరావు, మండలంలో నాయకులు వివిధ మండలాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు పాల్గొని ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ వెంకట్రావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎంతో సేవ చేశాడని అతడు గ్రామంలోని పెద్దలతో కలిసి పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దివి లింగం నాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ మండల అధ్యక్షుడు మండవ ప్రసాద్, మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్, గుమ్మల్ల వెంకట్రావు,మండవ మురళీమోహన్, దాసరి కృష్ణారావు, మన్నెం మల్లికార్జున, పిడికిటి వెంకట్రావు, పల్లపోతు వెంకట్రావు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.







On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com